# అమ్మ

గోడకింద నులక మంచమ్మీద కూచుని పరధ్యానంగా ఎటో చూస్తూ పక్కాకు నమలులోంది బాలమ్మ. నిశ్చలంగా వున్న ఆమె చూపుల కింద నెమ్మదిగా దవడలు కదలుతున్నాయి.

అప్పటికే అంబలిపొద్దు దాటి వుంది. ఎండముల్లులు పదనెక్కుతున్నాయి. కృత్తికలోనే రోహిణి ఎండల రుచి అనుభవానికొస్తూ వుంది.

పిల్లల కోడి 'కొక్.... కోక్..' మంటూ అటుగా వచ్చింది. మెడ వంచి ఆమెకేసి ఓరగా చూసి పిల్లల్ని పిల్చుకొని మంచం కిందకు దూరింది.

కోడిపిల్లల కిచకిచల సందడికి ఆమె చూపుల్లోని నిశ్చలత సడలింది. రెండ్రోజులైంది - తను వాటికి గింజలు చల్లక, చేతులు చాచి స్పర్శతో పలకరించక. మాటి మాటికి తన వద్దకొచ్చి గోలజేస్తున్నాయి.

లేత బర్రెదూడ చెంగు చెంగున గెంతుతూ మంచం దగ్గరగా వచ్చింది. మోరచాచి ఆమె కాలు మూచూచి అదే చెంగలింపులతో వెళ్లింది.

దూడను కట్టేయకుండా గాలికి వదిలారు. అది వీధి వీధి తిరిగి, ఏదొక గోడకింద పుల్లదుమ్ము నాకుతుంది. కడుపులో నట్టలు పెరిగి పాండవరోగం తెచ్చుకుంటుంది.

లేచి వెళ్లి తలుగు పెడదామనిపించింది గాని ఎందుకో ఆగిపోయింది. అంతలో చిన్నోని కొడుకు తప్పటడుగులు వేసికొంటూ, కింద పడుతూ లేస్తూ ఆమె దగ్గరగా వచ్చాడు. ఆమెకేసి తలెత్తి చూస్తూ దేవునిభాషలో ఏవో శబ్దాలు చేశాడు. ఆ వెనక బోసిగా నవ్వాడు.

జేజి మొహంలో ఎలాంటి స్పందన కన్పించక పోవటంతో వెనుదిరిగాడు. నాలుగడుగులు వేసి కిందపడి లేచాడు. అప్పుడే బర్రెదూడ అటుగా చెంగలిస్తూ వస్తోంటే... పిల్లోన్ని ఢీకొడుతుందేమోననిపించి పానం కొట్టుకులాడింది బాలమ్మకు.

చంటిపిల్లోన్ని వీధిలోకి వదలి ఆడమ్మగారంతా ఎక్కడున్నట్లో? లేవాలనుకొని మంచం దిగబోయింది గాని ఒక్కసారిగా నీరసం ముంచుకొచ్చింది. ఆ వెనకే తన పరిస్థితి గుర్తొచ్చింది.

రెండ్రోజులైంది - పచ్చి మంచినీళ్లు ముట్టక.

"అమ్మే బాలమ్మా! యాడుండావమ్మే?" ఇంటి ముందు నించి పిలుపు.

బండెద్దులోల్ల రామయ్య గొంతులాగుంది.

ఇంట్లోవాళ్లూ, ఇరుగుపొరుగులూ అయిపొయ్యారు. ఊర్లో పెద్దమాసి కాడికి పోయినట్టుంది వ్యవహారం.

"అదో మామా!.. ఆ పక్క గోడ కింది..." పెద్ద కొడుకు రవణయ్య.

"ఓరె నాయాన్లారా! రెండ్రోజుల్నించి కూడునీల్లుగ్గబడితే మీకెట్టా పిడచదిగుతాందిరే!.. మీరు తినకుండా అయమ్మి ఎప్పుడన్నా మెతుకు ముట్టింటదా? మిమ్మల్నెట్ట సాకిందెనీ!... సంసారాన్ని ఎట్ట సగదీడిందనీ.." అంటూ గొంతుతోబాటు మనిషి కూడా గోడ యివతలికి రాగానే "ఏందిమ్మే! నీ ఎర్రి దొంగల్దోలా! ఏమంత కట్టమొచ్చిందెమ్మే?" అన్నాడు మంచం దగ్గరగా వస్తూ రామయ్య.

మంచం మీద సర్దుకొంది బాలమ్మ.

"నేను గాని నా పెండ్లాం గాని ఆమెను పల్లెత్తు మాటగూడా అనుండం. మామా! ఎందుకోమరి మాయమ్మ మామీంద అలిగింది" చెబుతున్నాడు రమణ.

కొడుకుకేసి ఓసారి ఎగాదిగా చూసింది బాలమ్మ.

కఱ్ఱ వూదుకొని మంచం మీద కూచుంటూ "యాందిమ్మే కూడునీల్లుగ్గ బట్టినావంట.. నీ ఎఱ్ఱి దొంగల్లోలా! – నీకేం గాచారం బట్టిందీ? యీ యింటి గడప తొక్కింది మొదలు ఎంతలావు కట్టంజేసినావమ్మే! అతగాడు మెతక నాయాలయినా నడుంకు నారతడప కట్టుకొని మొగోనాల పాటు బన్నెవే! బూములు కొంటివి. ఎనుముల సంపాదిస్చివి. గట్టి కొంపేచ్చివి. యీల్లిప్పుడు ముడ్డిదిప్పి కులుకుతావుండే యీ మిద్దె నువ్వు నిలేసిందేగాదూ! తోడబుట్టినోనికంటే జాస్చే జెబుతాండా – నీకేం గాచారం బట్టలే – గోడకింద కుక్కి మంచంలో కూకోను. నీకేం కర్మబట్టలే పస్చులుండను. లెయ్యమ్మే! లేసి ఎంగిలిబడు." చెప్పాడు రామయ్య.

"కుదర్దులేన్నా!" బాలమ్మ అంది. నా రెక్కల్లో బలమున్నెప్పుడు ఇద్దరికీ సెరోయింఢ్లు కట్టించినా. నాకిప్పుడు రెక్కల బలం తగ్గింది మాడిమిద్దెలేమొద్దు. గుడిసో వారపాకో నిలేసీమను. ఎండావానా సోకకుండా తలదాచుకునేంత సాలు. నా సేరెడు బియ్యం ఉడకేసుకొని నేను బతుకుతా!" ధృఢంగా అంది.

కొంతసేపు నిశ్శబ్దంగా ఉండిపోయాడు రామయ్య.

ఆమె స్వరంలోని ఖచ్చితత్వం ఆయనకు బాగా అర్థమైంది.

"గట్టిపట్టే పట్టినావుగదమ్మే!" అంటూ, గోడ దగ్గరగా దూరదూరంగా నిల్చుని వున్న ఆమె కొడుకులు రమణయ్య, గోపాల్‌ల కేసి చూసి "ఏమొరే నాయన్లారా! ఏమిట్టజేస్చిరే! మీ మీద యీగ వాలకుండా సాకిందిరా మీయమ్మ! మీకు మంచి తిండే తినబెట్టింది. మంచి గుడ్డే కట్టబెట్టింది మరి... యీనాటికి యీమెకు పిడ్సబెట్టను బరువైందా యేందిరా?" అడిగాడు.

"రామ రామ! ఎంతమాట మామా! మాయమ్మకు మా యింట్లో అడ్డమేముంది? యీ రోజుటికీ నా పెండ్లాం కూడుబెడ్తే నాకు కడుపు నిండదు మామా! ఆమె సేతిపిడ్స ఒక్క ముద్దయినా తినాల్సుందే..." రమణయ్య చెప్పాడు.

అతనికేసి పునుకు పునుకున చూసింది బాలమ్మ.

"పొద్దున్నే లేసి మాయమ్మ మొగం సూస్చేనే నాకారోజంతా మనస్సు స్థిమితంగా వుండేది. ఆమె మాకు పెద్దదిక్కుమామా!" గోపాల్ అన్నాడు.

అతనికేసి కొరకొర చూసింది బాలమ్మ.

"యీ నాయాండ్ల మాటలకేంగాని... నువ్వు జెప్పమ్మే! యీల్లు నీకు పిడస పెడ్తాంద్రా లేదా?" ఆమెకేసి చూస్తూ అడిగాడు రామయ్య.

"వాల్లు పెట్టేదేందిన్నా! నేనేం వూరికే తిండంలే... అంతకు రొండింతలు కట్టం జేస్చాండా! నాకాలూసెయ్యీ ఆడక మంచాన్నో కంచాన్నో పడినప్పుడా.. పుడిసెడు మందు తాగితే అదె కైలాసం జూపిస్చాది..." సన్నని స్వరంతో అంది.

"ఏమ్మాటలు తీ బాలమ్మా!" రామయ్య మందలించాడు.

"సూడు సూడోయ్ దొరా!" మంచం దగ్గరగా వచ్చాడు బాలమ్మ మొగుడు గురయ్య. "దీన్ని ఎవురేమంటాండరనీ యింతలావున అలక్కుంటే! నాయల్నే ఏ

కొడుక్కాన్నే ఒక కొడుక్కాడ పడుంటేం? ముసిలిముప్పున యేరుగాపురమేందీ?" అన్నాడు ఫిర్యాదు చేస్తోన్నట్లుగా.

కనుబొమలు ముడేసి అతనికేసి నిశితంగా చూసింది బాలమ్మ.

"అందర్నీ అగసాట్ల పాల్టేసేందుకే నువ్వీమంకు పట్టుపట్టింది" చెబుతూ వెనుదిరిగాడు గురయ్య.

"ముసిలోడా! నోరముయ్యి" గయ్యిమంది ఆమె. "నీ కడుపు నిండుతే సాలు. ఎవురెట్టన్నా సావనీ... వొంట్లో నెత్తురున్నెన్ని రోజులూ నీయింధ్లే నాయింధ్లనుకొన్నే. నీవాళ్లే నా వాళ్లనుకొన్నే. నీ కష్టమే నా కష్టమనుకొన్నే. నా సేతనైన కాడికి సంసారాన్ని నగదీడినా..... యిప్పుడు నా వొళ్లు నత్తువ తగ్గుతానే నీ సుగం నువ్వు సూసుకుంటాండవు. యిన్నేండ్లూ తోడుగా వున్నె నన్ను యిడ్సిపెట్టి నీ దావ నువ్వు పోతాండవు. ఇది మంచిది గాదు... కొడుకులకాడ నేనుండలేనప్పుడు నువ్వూ నాతోబాటు పక్కనుండాల... కలోగంజో నాతో కలిసే తాగాల.... దేవుడు నీకాబుద్ధి పుట్టించలే... మల్లా నన్నే తప్పు బడ్తాండవు..." అంది నిష్టూరంగా.

గురయ్య వెనుదిరిగి కూడా చూల్లేదు. సన్నగా గొణుక్కుంటూ వెళ్ళాడు.

ఆమె తీక్షణత రామయ్యకు అర్థమైంది.

ఏదో బలమైన దెబ్బే తగిలింది. మనస్సు బాగా నొప్పెట్టుకొంది. ఆ దెబ్బ ఏమైందీ చెప్పటం లేదు. తనెందుకు కొడుకులకు దూరంగా వుండాలనుకొంటోందో కారణంగా విప్పటం లేదు.

ఆమె అంతరంగమేదో రామయ్యకు అంతబట్టడం లేదు.

బాలమ్మ అలిగిన విషయం ఊర్లోవాళ్లకు కూడా వింతగా వుంది. కారణం చెప్పకుండా అలగటం చాలా మంది ముసలాళ్లకు ఆశ్చర్యంగా వుంది.

సాయంత్రానికి బాలమ్మ కూతురు లక్ష్మిదేవి బస్సు దిగింది.

ఒక చేతిలో సంచిని వేలాడేసుకొని, చంకన పిల్లాణ్ని వొద్దికగా కరిపించుకొని ముందుగా పెద్దన్న యింట్లోకెళ్లి కాళ్లు మొగం కడుక్కుంది. చిన్నన్న యింట్లో దూరి చన్నీళ్లు తాగింది. తర్వాత నేరుగా అమ్మ దగ్గరకు వెళ్లింది.

అప్పటికే వదినగారు దిగాలు చూపులతో ఆమె కళ్లకు చెప్పవలసిన సంగతులన్నీ చెప్పేశారు.

అమ్మ వద్ద కూచుని చూపులతోనే ఒళ్లంతా తడివి చూసింది లక్ష్మిదేవి. ఎన్నో ప్రశ్నల్ని గుప్పించింది. అరటి పళ్లు ముందుబెట్టింది తినమంటూ. లడ్డు కారాలు వొళ్ళో పోసింది కొరకమంటూ.

అన్నిటినీ పక్కకు నెట్టింది బాలమ్మ. కూతురి చంకలోంచి మంచం మీదకు దిగజారుతూవున్న మనవణ్ని చేతుల్లోకి తీసికొంది. నీరసమైన పెదాలతో వాడికి ముద్దిచ్చింది. తలమీద వేళ్లతో తాకి "వునికె ఎండిందే! నేదరి పిల్లోడు గాదూ! సమురంటుపో..." అంది.

తల్లికేసి ఎగాదిగా చూసింది లక్ష్మిదేవి.

రెండ్రోజులకే కళ్లు లోతుగా పీక్కుపోయాయి. మొహమంతా వాడిపోయింది. కడుపులోంచి దుఃఖం తన్నుకొచ్చింది ఆమెకు.

"యీడ నీకు కుదరకుంటే మావూరికి పోదాం రామా!" ఆర్ద్రంగా పిల్చింది.

నీరసంగా నవ్వింది బాలమ్మ.

అరటి పళ్లో. కారేలో తినమని మరోసారి ప్రాధేయపడింది లక్ష్మిదేవి. తన అభ్యర్థనను ఏమాత్రం లెఖ్ఖజేయని తల్లి ప్రవర్తన చూసి శోకాన్ని అపుకోలేక పోయింది.

"నీకిదేం ఖర్మమ్మా! నువ్వుదినే సేతిపిడ్స మాకాడ లేకనా? రామ్మా! మా వూరికిరా!.... నువ్వు పచ్చులుంటే మేం తట్టుకోలేంమా!" అంటూ గద్గదంగా ప్రాధేయపడింది. పిల్లాడితోటి తనూ తల్లివొడిలో తలవాల్చి వలవల ఏడ్చింది.

బాలమ్మకు కూడా కళ్లల్లో నీళ్ళు తిరిగాయి.

వాటిని బైటకు రాకుండా లోలోపలే అణచుకొంటూ "పిల్లోనికి సమురంటు పోమ్మే!" అంటూ కూతుర్ని లేవదీసింది.

కొడుకు తలకు చమురంటి, మంచమ్మీద కూచుని పాలిస్తూ ఆలోచనల్లో మునిగి పోయింది లక్ష్మిదేవి.

చిన్నప్పటినుంచీ అమ్మ తమను సాకిన విషయమూ, మరీ ముఖ్యంగా అన్నల మీద ఆమె చూపించిన ప్రేమ గురించిన జ్ఞాపకాలూ దృశ్యాలై ఆమె కళ్ళ ముందు కదలాడాయి.

మనస్పర్థలతో కుతకుతలాడే అన్నదమ్ముల మధ్య రావలసిన వేరుబాటు ఆలోచనలు యీ ముసలి ముప్పున తల్లి మనస్సులో ఎందుకు జొరబడినట్లు?

అవును... ఏడాది దాటింది - అన్నలిద్దరూ మనస్పర్థల వల్ల విడిపోయి వేరు కాపురాలు పెట్టి. అప్పుడు కూడా ఆమె ఎంత చాకచక్యంగా కుటుంబ బాధ్యతల్ని నిర్వర్తించిందనీ! వాళ్ల మధ్య సరిపోని తనాన్ని వీధిలోకి పోనికూండా కట్టడి చేసింది. ఒకనాటి రాత్రి రహస్యంగా బండెద్దల రామయ్యను పిల్చి తెల్లారేసరికి భాగాలు వొగదెంచింది.

మొదట అమ్మానాన్నలిద్దరూ పెద్దన్న దగ్గరే వుండేవారు. తర్వాత అమ్మ ఒక్కతే చిన్నన్న యింటికి పోయింది. ఇప్పుడేమో పూర్తిగా వేరు కాపురం పెట్టాలని పట్టుబట్టింది.

వదినెలు ఆమె ఎదుటబడి నోరెత్తే వాళ్లు కాదు. అన్నలకు కూడా అంత ధైర్యముందని తాననుకోవటం లేదు. మరి... అమ్మ ఎందుకు అలిగినట్లు?

బాలమ్మ రాత్రికి కూడా పిడచముట్టకపోయేసరికి ఇంట్లో అలజడి మొదలైంది. విషయం వూర్లోకి పాకి చిన్నాపెద్దా వచ్చి ఆమెకు నచ్చ జెప్పేందుకు ప్రయత్నించారు.

ఆమె మొండిపట్టు వదలకపోయేసరికి ఆమె కొడుకుల్ని పిల్చి చెప్పారు - నాలగు వాసాలూ పదిమోపుల బోదగడ్డి తెచ్చి చిన్న గుడిసె జేసీంద్రా!... మనిషిని సంపుకుంటామా!" అని.

ఆ మాటలకు వాళ్లు సమ్మతించలేదు.

"ఆమెకు మేమేం తక్కువ జేసినం? కూడు బెట్టలేకనా.... గుడ్డ తెచ్చీ లేకనా?.... మేమేం తప్పు జేసినామని ఆమె అలగడం? ఇంత మందిలో మమ్మల్ను తప్పుడోల్లన్జెయ్యాల్సిన పనేమొచ్చె!" అంటూ ఆవేదన చెందారు.

వాళ్ల బాధ కూడా సబబుగానే తోచింది.

ఎన్నో కష్టాలు యీది సంసారాన్ని యిక్కడిదాకా లాక్కొచ్చిన ఘటం ఆమె. లోకులచేత గయ్యాలిగంప అనిపించుకొని మరీ పిల్లల్నీ మొగున్నీ రెక్కల కింద దాచి సాకి సంతరించిన ఆడది. వీధిలోంచి తమ పిల్లల ఏడుపు విన్పిస్తే చాలు యింట్లోంచే

నోటిని మూకులా తెరచి యుద్ధానికి వెళ్ళినట్లుగా పరుగెత్తి అవతలి పిల్లల్ని బెంబేలెత్తించి, మరోసారెప్పుడూ తన పిల్లల జోలికి రాకుండా బెదరించుకొనేది. గెట్లకాడ, గెనిమల కాడ నోటినే ఆయుధంగా ఇరుగుపొరుగు చేల నుంచి తన చేలకు రక్షణ కల్పించేదీ. బాలమ్మా! ఆమె నోట్లో నోరుబెట్టి మనం బతుకుతామా!' అని వూర్లో వాళ్లు భయపడేలా సంసారం చేసింది. పొలాలు కొన్నది. మిద్దె కట్టించింది. కొడుకుల్ని ఆస్తిపరుల్ని చేసింది. అంతమంచి గృహస్తురాలు ఇప్పుడు తన వాళ్లందర్నీ దూరంగా పెట్టి ఒక్కటే బతకాలనుకోవటం వింతగా వుంది.

మరుసటి రోజు ఉదయానికి కూడా ఆమె పచ్చి మంచినీళ్లు ముట్టుకోలేదు. ఒక్కగానొక్క కూతురు వచ్చి కూడా ఉపయోగం లేకపోయింది.

అప్పటికే చుట్టపక్కాలకు వార్త పాకింది.

రాత్రికంతా పడమటి పల్లెల్నించి ఆమె ముగ్గురు తమ్ముళ్లు వచ్చారు. అల్లుడొచ్చాడు. కోడళ్ల నాయనగారొచ్చారు. ఇంకా గ్రామంలోని ముసలీముతకా జనం... ఏదో పంచాయితీ జరుగుతోన్నట్లుగా వుంది వాతావరణమంతా.

లేని ఓపిక తెచ్చుకొని నులకల మంచమ్మీంచిదిగి గోడవార అరుగుమీద కూచుంది బాలమ్మ. ఇంత మంది చుట్ట పక్కాలను తెచ్చి పంచాయితీ పెట్టించిన కొడుకుల మీద కోపంగా వుంది ఆమెకు.

తను అన్నం తినలేదనే బాధ వాళ్లకుంది. తన చేత అన్నం తినిపించేందుకే వీళ్లందర్నీ కూడేశారు. అదే ఆమెకు ఎక్కసగా వుంది. వాళ్లు ఇంతలావు పన్జేయకుంటే – తను కోరుకున్నట్లు ఒక్క అంకణం గుడిసె కప్పించి ఉండొచ్చు గదా! ఆ పని చేయరుగాని వాళ్ళ పంతం నెగ్గించుకొనేందుకే యీ పంచాయితీ పెట్టించారు.

"ఏమ్మే! నీ ఎర్రి దొంగల్దోలా! ఆత్మారామున్ని పచ్చుబెడ్తే మా పాపమంట సిన్నా! నువ్వీడ కూడు నీల్లుగ్గబట్టేతలికి నీసుట్ట పక్కాలంతా కదిలింగ్రు సూడూ! నువ్వంటే ఎంత పానమో! ఎంత అభిమానమో! యీల్లన్నూసెన్నా ఒకపిద్ద ఎంగిలిబడు.... ఉపోద్ఘాతంగా ఎత్తుకొన్నాడు బండెద్దల రామయ్య.

ఆమె ఏమీ మాట్లాడలేదు.

పక్కన కూచున్న ముసలళ్లు ఏదో గొణుగు తున్నారు.

పెద్దకొడుకు రవణయ్య ముందుకొచ్చాడు.

"మేమేమన్నా ఆమెకు లోటుజేసింటే ఆమె కాలిసెప్పుతో కొట్టమను. నా పని వానికి నచ్చకో, వాని పని నాకు నచ్చకనో యేరుబడి బతుకుతండాం గాని ఆమెకేమైనా లోటుజేసినామా? ఆమె పెద్దరికానికి కుందస్సు జేసినామా! సెప్పమను మామా! మాయమ్మ మమ్ముల్ను ఎట్టసాకిందీ మాకు తెల్దా?.... మర్సిపొయ్యేంత పరాలమా? ఇప్పుడామె కూడు నీల్లుగ్గబట్టి గోడకింద పడుంటే మాకు మాత్రం తిండి సయిస్తదా? కొడుకులు సరిగ్గా చూసుకుంటే ఆమెందుకు అలుగుతాదని యిప్పటికే అందరూ చెవులు కొరుక్కుంటాండరు... ఇదేమన్నా మంచి పద్ధతేనా? మాకాడ వుండేందుకు ఆమెకంత యిష్టం లేకుంటే ఒక్కమాట సెప్పమను... యిండ్లూ వాకిలీ యిడ్చి యాడికెన్నా పోయి బతుకుతాం" అతని గొంతు గద్గదమైంది.

శ్రోతల హృదయాలు కూడా జల్లుమన్నాయి.

అతను ఆవేదనతో రగిలిపోతూ తల్లిమీద ప్రశల్ని సంధిస్తున్నాడు.

విన్నంతసేపు విని మెల్లిగా ఓపిక తెచ్చుకొంది బాలమ్మ.

"పెద్దోడా!... మీరు పెట్టలేదని నేనెప్పుడన్నా అన్నైనా? లోటు జేసినారనీ కుందస్సు జేసినారనీ ఎవురితోనైన్నా సెప్పుకొన్నానా?" అంది. "నా కొడుకులూ మంచోళ్లే... నా కోడన్లూ మంచోళ్లే.... నా మొగుడూ మంచోడే. నా రాత యిట్టుంది.

నేనేమడిగినా... ఒక సిన్న చుట్టు గుడిసె బేసీమన్నె.... దానికే యింత రాద్ధాంతమా నాయినా!... మీకంత కష్టమైతే వొద్దులే... ఏదోక సత్రం పంచన పడుంటా...." నీరసంగా లోగొంతుకతో సమాధానం యిచ్చింది. ఆమె మాటల్లో నాలుగు రోజుల ఉపవాసఫలం స్పష్టంగా కన్పిస్తోంది.

ఎవురి యింటి పంచనో పడుండాల్సిన ఖర్మ నీకేం బట్టిందిక్కా?" ఆమె పెద్దతమ్ముడు అందుకొన్నాడు.

తమ యింటికి రమ్మంటూ అల్లుడు ప్రతిపాదించాడు.

ఒకరి తర్వాత ఒకరుగా తమ ప్రశ్నల్ని సంధించారు. అభిప్రాయాల్ని వెలిబుచ్చారు.

అంతమందికీ ఆమె నీరసపడిపోతూ, వేసటపడుతూ యిచ్చిన సమాధానం - తను తన కొడుకులతో కలిసి వుండలేననీ, ఎక్కడికీ రాననీ.

"అదే... ఎందుకు? మాతో ఎందుకు కలిసుండలేవు? మేమెందుకంత పాపిస్టి ముండాకొడుకులమయినామో సెప్పమా?... అందరూ యినాల... సెప్పు..." రవణయ్య నిలదీశాడు.

బాలమ్మ మౌనంగా వుండిపోయింది.

"నీ ఎర్రి దొంగల్దొలా! మనసులో వుండేది కక్కమ్మే!" రామయ్య అన్నాడు.

"సెప్పమ్మా...! నా కాడ ఎందుకుండవో సెప్పు... నేనేం తప్పు జేసిన్నో సెప్పు..." అంటూ తల్లిదగ్గరకు విసురుగా వెళ్లాడు రవణయ్య... మీద మీదకు వెళ్లాడు నిలదీస్తోన్నట్లుగా.

వేలబడి పోతూ వున్న శరీరాన్ని గోడవారగా పైకి లేపి కూచుంది బాలమ్మ.

ఎగిరెగిరి పడుతూ వున్న కొడుకుకేసి అదోలా చూసింది.

"నీదేం తప్పులేదు నాయినా! నాదే తప్పు... అంతా నాదే... నీ యింట్లో వుండి... నీ సెతి పిడ్స తింటూ... నువ్విచ్చిన గుడ్డ కట్టా... జంగిడి నుంచి వొచ్చిన సిన్నోని గొడ్లు - యింట్లో కట్టేసేవాళ్లు లేక పరాయి సేలల్లో బడిమేస్సాంటే.' వాలు అమ్మలక్కల తిడ్తారనీ, ఆ తిట్లు మా యింటి ఆడోల్లకు తగుల్తాయనీ... గొడ్లను తోలకొచ్చి గుంజలకు కట్టేయడం నా తప్పే. ఆలు మొగున్లు పొలం పనికి పోతే... ఉయ్యాల్లో పిల్లోడు లేచి జారపడబోతాంటే ఎత్తుకొని కనిపెట్టుకొని వుండడం నా తప్పే.... నా యింటి కూడు దింటా నువ్వు వాని పన్జేస్తే వొప్పుకోనని నువ్వు సెప్పినా యినుకోకుండా యిరుకు ఇబ్బందులకు వానికి సాయం జెయ్యడం తప్పే.... నాదే తప్పు... నేనే తప్పుడుదాన్ని"

గతుక్కుమన్నాడు రవణయ్య.

"అదీ - అదీ..." అంటూ తల గీరుకోసాగాడు.

ఆమె అలగడానికి కారణం యింత చిన్న విషయమని తేలేసరికి వింటోన్న వాళ్లంతా ఉస్సురుమని నిట్టూర్చారు.

"సిన్నోడా!" మరో వైపున నిల్చుని వున్న చిన్నకొడుకును పిల్చింది బాలమ్మ. "నీ పన్జేసినానని వాడు నీమీంద కోప్పడితే గుడ్డలు సంకలో పెట్టుకొని నీ యింటికొచ్చినా... నువ్వేం జేసినవూ? గుర్తులేదా?" అతని కేసి చూస్తూ ఆగింది.

'నేనేమన్నెనమా? రావొద్దన్నెనా!" ఆదుర్దాగా అడిగాడు గోపాల్. "రావొద్దన్లే... తిండి తినొద్దన్లే... నువ్వేమన్లే. నేనే సిన్నోడా! మీ వొదినె పుట్టింటికి పోతే ఆ యింటా బైటా కసవూడ్చి, బోకులు తోమి, పిడికెడు మెతుకులు ఉడకేసి యిచ్చి వచ్చినా... నువ్వొద్దన్నే ఆపన్జేసినా. నా యింటి కూడుదింటా అన్న పన్జేస్తే నేనొప్పుకోనని నువ్వు గద్దించినా నీ మాట యినుకోకుండా పెద్దోని యిరుకు ఇబ్బందులు తీర్చడం నాతప్పే. వాని కోళ్లకు గింజలెయ్యడం తప్పే. మేక పిల్లలకు ఆకో అలుమో తినిపించడం నా తప్పే... నాదే తప్పు... నేను తప్పుదుదాన్ని..." ఆమె గొంతు గద్గదమైంది.

"నా పన్జేయొద్దని ఆయప్ప జెప్పినప్పుడు నేను మాత్రం ఎట్టా వొప్పుకొంటానుమా?" గోపాల్ అన్నాడు.

"మాకు మాకు సరిపోనెప్పుడు నాకాడ వుంటా వానిపనీ, వానికాడ వుంటా నాపనీ నువ్వెందుకు సెయ్యాలమా?" రమణయ్య నిలదీశాడు.

అతనికేసి అదోలా చూసింది బాలమ్మ.

పని చేయించుకొనేప్పుడు రాని ప్రశ్న పంచాయితీలో వచ్చింది.

వింటోన్న వాళ్లకు రవణయ్య మాటలు సబబుగానే తోచాయి.

తప్పు ఆమెదిగానే అన్పించింది.

ఆమె భర్తకు రాని సమస్య ఆమెకు రావటం విడ్డూరంగా తోచింది.

"నీ ఎర్రి దొంగల్దోలా! దీనికంటెమ్మే నువ్వలిగిందీ!" తేలిగ్గా అన్నాడు రామయ్య. "నీ కొడుకులకు ఒకరంటే ఒకరికి పడదు. వాని మాటెత్తుకొంటే ఈనికి కోపం. ఈని సంగ తెత్తుకుంటే వానికి మంట. ఇప్పుడు వాళ్లు అన్నదమ్ములు గాదు. దాయాదులు... దాయాదులయిన్రు. మత్సరాలు పెంచుకొన్నెరు. నువ్వెందుకు వాళ్ల నడుమన నలిగిపోతావు?" చెప్పాడు.

దీర్ఘంగా నిట్టూర్చింది బాలమ్మ.

"ఏమోన్నా! నేనంత తెల్సిందాన్ని గాదు.... సంటి పిల్లోడు తప్పటడుగులు వేసుకుంటావచ్చి వొళ్లో కూకుంటే... వాడు నాకు పిడచబెట్టే వాని కొడుకుకాదని నాకనిపించదన్నా! పిర్రెమీద ఒక దెబ్బేసి తరిమేందుకు నాకు సేతగాదు. బర్రెదూడ వొచ్చి గోముగా వేల్లు నాకుతుంటే అది నేనుండే కొడుకుది గాదనే సంగతి నాకు తోచదన్నా! పిల్లలకోడి గింజలకోసం కొటకలాడతా నాకాడికొస్చే అది ఏకొడుకుదో నేను లెక్కగట్టలేనన్నా!" ఆమె గొంతు జీరవోయింది.

ఏదో చెప్పబోయిన రామయ్య గొంతుక్కి కూడా మరేదో అడ్డుపడింది.

"నిజమేన్నా! నిజమే. వాళ్లు పుడ్తా అన్నదమ్ములు. పెరుగుతా దాయాదులు.. నిజమే.. కానీ అన్నా! వాళ్లు అన్నదమ్ములుగా పుట్టినపుడూ నేను అమ్మనే.. రేపు యింగో రకంగా మారినా నేను అమ్మనే. నాకు వాల్లిద్దరూ వొకటే. నా బొందిలో వూపిరున్నెన్ని నాల్లూ వాళ్లు యిబ్బంది పడ్తాంటే నేను సూల్లేనన్నా! వాళ్లు అన్నదమ్ములైనా దాయాదులైనా నాకొడుకులేన్నా!" చెప్పింది.

"మరెందుకమ్మా యేరుగాపురం పెట్టాలని సూస్తాండవూ? వాళ్లకు దూరంగా వుండాలని అలిగినవూ?" గుంపులోంచి ఎవరో అన్నారు.

కొంతసేపు మౌనంగా వుండిపోయింది ఆమె.

శక్తి కూడదీసుకోడానికి అన్నట్టుగా రెండుసార్లు గట్టిగా గాలిపీల్చుకొంది.

"నా కొడకలకు దగ్గరకావాలనే నేను యేరే వుండాలనుకొనేది" అరమోడ్పు కళ్లతో చెప్పింది.

అక్కడున్న వాళ్లెవరికీ ఆమె అంతరంగం అర్థం కాలేదు.

"పెద్దోనికాడుండి వాని సంగటి తింటా సిన్నోనికి పన్జేస్తే పెద్దోనికి కోపం.. సిన్నోనికాడుండి పెద్దోనికి పన్జేస్తే సిన్నోనికి మంట... వానింట్లో కూడుదింటా వానిపనే జెయ్యడానికి నేనేం కూలిదాన్ని కాదు... అమ్మను.. ఎవురు యిబ్బందుల్లో వుంటే వాళ్లకు సాయపడాల.. నా మనమన్లను ముద్దుజెయ్యాల.. బర్రెదూళ్లకు గడ్డేయాల. కోళ్లకు గింజల సల్లాల. ఎవుని యింటికాడున్నే యియ్యన్నీ కుదరదు. అందుకే.. నాకాలు సెయ్యా ఆడినన్నాళ్లూ నా సంగటి నేను తింటా వేరుగా వుండి పనుల్జేసి పెడ్తా... అందుకే నేను వానికాడ వుండలేను.. యీని కాడ వుండలేను.. ఒక్కంకణము.. ఒకే ఒక్క అంకణము సుట్టు గుడిసె బేసియ్యమని సెప్పండి సాలు... ఒక్కంకణము..." అంటూ వలవల ఏడవ సాగింది బాలమ్మ.

అక్కడ అంతులేని నిశ్శబ్దం ఒకటి ఆవరించింది.

అమ్మదనపు భావన చనుబాలంత కమ్మదనంగా అక్కడి జనాన్నంతా కమ్ముకొని మైకంలో పడేసింది.

వాళ్లు కళ్లు తెరచి చూసేసరికి - అప్పటిదాకా నిలువెత్తున నిల్చుని ఎగిరెగిరి పడుతూవున్న అన్నదమ్ములిద్దరూ - నేలకు మూరెడెత్తున్న గొంతుక్కూచుని భూమిలోకి కుంగిపోతూ కన్పించారు.

● సాహిత్యనేత్రం త్రైమాసిక (2వ సంచిక) ఏప్రిల్-జూన్, 2007 ●